

జంపన్నవాగులో బాలుడి గల్లంతు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జంపన్నవాగులో బాలుడు గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తల్లిదండ్రులతో కలిసి పది సంవత్సరాల వయస్సు గల అనూష్ జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న క్రమంలో గల్లంతైనట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న గాజ ఈతగాళ్లు అనూష్ ఆచూకీ కోసం వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. అనూష్ జంపన్నవాగులో గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.





తనివితీరా మొక్కులు


చిలకలగుట్ట రోడ్డుపై ముగ్గులు వేస్తున్న భక్తులు


మేకపోతును బలిస్తున్న భక్తులు


యాటపోతుతో జడ్డి పట్టిస్తున్న భక్తులు

మేడారం(మంగపేట)/(భూపాలపల్లి అర్బన్): మేడారంలోని చిలుకలగుట్టకు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద గురువారం ఉదయం నుంచి భక్తులు సమ్మక్కకు తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. చిలుకలగుట్ట నుంచి సాయంత్రం కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క గద్దెపైకి రానున్న నేపథ్యంలో మేడారం పరిసర అటవీ ప్రాంతంలో తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకొని మూడు రోజులుగా విడిది చేసిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి యాటపోతులను బలిచ్చి చిలకల గుట్ట ఆర్చ్ గేటు వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు, శివసత్తులు సమ్మక్క తల్లిని ఆహ్వానిస్తూ రంగురంగుల ముగ్గులతో చిలకల గుట్టకు వెళ్లే దారిని అలంకరించారు. దారిపొడవునా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు.

సమ్మక్క అబ్బియ్యో..


మేడారం (కన్నాయిగూడెం) : జాతరలో శివసత్తులు ఒడిబియ్యం నింపుకొని పూనకాలతో గద్దెల వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

మొబైల్ వైద్య సేవలు



మేడారం (కాళేశ్వరం): మేడారం జాతరలో భక్తుల వద్దకు మొబైల్ వైద్యసేవలు అందుతున్నాయి. గురువారం జంపన్నవాగు వద్ద మొబైల్ టీం వైద్యులు తమ వద్దకు వచ్చిన వారికి చికిత్సను అందించారు. జాతర మొత్తం 40 మొబైల్ టీంలు బైక్‌లపై తిరుగుతూ సేవలు అందిస్తున్నారు.

ఎక్కడి తలనీలాలక్కడే



మేడారం (వెంకటాపురం(కె)): భక్తులు తమ మొక్కులను తీర్చుకుని తలనీలాలను సమర్పించుకుంటారు. కాగా, జంపన్న వాగు సమీపంలోని కల్యాణకట్టలో తల నీలాలను శుభ్రం చేయకపోవడంతో ఎక్కడి తలనీలాలు అక్కడే ఉన్నాయి. దీంతో తల నీలాలను ఇచ్చేందుకు వచ్చిన భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చలువ పందిళ్లు.. చన్నీళ్లు



ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మహాజాతరలో అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్‌లో వచ్చే భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో క్యూలైన్లపై చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం దేవాదాయ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేసి చలువ పందిళ్ల కింద నల్లాలను ఏర్పాటు చేసి భక్తులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ నల్లాల వద్ద షిఫ్టుల వారీగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భక్తులకు తాగునీటిని అందిస్తూ సేవలందించారు.

ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలపై ప్రదర్శనలు



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరలో ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు డీఎస్ జగన్ పేర్కొన్నారు. జాతరలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శించిన ఆదివాసుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం మహాజాతర ప్రారంభానికి ముందు నుంచి నాలుగు రోజుల పాటు 40 బృందాలచే ప్రతిరోజూ 10 ప్రాంతాల్లో చిందు యక్షగానం, జానపద, కోలాటం, మందహెచ్చులు, కళారూపాలను మేడారంలోని చిలకలగుట్ట, జంపన్నవాగు, గిరిజన మ్యూజియం, హరిత హోటల్, ఆర్టీసీ బస్‌స్టేషన్, కన్నెపల్లి, గట్టమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పోలీస్ కుటుంబాలకే ప్రాధాన్యం


కంట్రోల్ రూమ్ వద్ద భక్తులను అడ్డుకుంటున్న పోలీసులు

మేడారం(ములుగు రూరల్): మేడారం జాతరలో పోలీసులు వారి కుటుంబాలకు, తెలిసిన వారికి ప్రాధాన్యత ఇస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గద్దెల వరకు వెళ్లేందుకు అనుమతి ఇస్తున్నారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళా భక్తురాలు తన భర్తతో కలిసి క్యూలైన్‌లో నిలబడి దర్శనం చేసుకునే ఓపిక లేదని కమాండ్ క్రంటోల్ రూమ్ నుంచి అనుమతించాలని పోలీసులను వేడుకుంది. అయినా పోలీసులు వినకుండా ఆమె భర్తను అక్కడ నుంచి లాగేశారు. భర్తను పోలీసులు తోసివేయటంతో ఆమె అసహనానికి గురై పక్కనే ఉన్న గ్రిల్స్‌కు తలను బాదుకుంది. మీ కుటుంబ సభ్యులకు అనుకూలంగా దర్శనాలు చేసుకుంటూ సామాన్య భక్తులను ఇబ్బందులకు గురి చేయటం సరికాదంటూ పోలీసులపై అసహనం వ్యక్తం చేసింది. మీడియా ప్రతినిధులు వీడియో రికార్డు చేస్తుండగా పోలీసులు సెల్‌ఫోన్‌లు సైతం లాక్కొని అత్యుత్సాహం ప్రదర్శించారు.

పోలీసుల అత్యుత్సాహం


విలేకరులను అడ్డుకుంటున్న పోలీసులు

మేడారం(ములుగు రూరల్): మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మీడియా సమావేశానికి కొంతమంది విలేకరులను అనుమతించి మరికొందరిని పోలీసులు అడ్డుకున్నారు. కవరేజ్‌కు వెళ్లాలని పోలీసులతో వారించిన వారు పట్టించుకోలేదు. ఏఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకే అడ్డుకుంటున్నామంటూ మీడియాపై దురుసుగా ప్రవర్తించారు. మీడియా ప్రతినిధులు ఏఎస్పీతో మాట్లాడే ప్రయత్నం చేసిన సుముఖత చూపలేదు. దీంతో మీడియా సమావేశం ఉందంటూ సమాచారం ఇచ్చి విలేకరులను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం అని నిలదీశారు. చేసేదేమి లేక అక్కడనుంచి వెను తిరిగారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకోని సమావేశాలకు విలేకరులను అనుమతించాలని డిమాండ్ చేశారు.

జంపన్నవాగులో ఒకరి మృతి

మేడారం(ఎంజీఎం): జంపన్న వాగులో స్నానం చేస్తుండగా గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పాపగోండకు చెందిన సాయిలు(35) మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు గురువారం సాయంత్రం వచ్చి జంపన్న వాగులో స్నానం ఆచరిస్తుండగా గుండె పోటుతో మృతి చెందాడు. కాగా, మృతదేహాన్ని రెస్క్యూటీమ్ మెగా వైద్యశిబిరానికి తరలించారు.

సంతానం కోసం వరం

మేడారం (కాళేశ్వరం) : మేడారం మహాజాతరకు వచ్చిన దంపతులు సంతానం కోసం జంపన్నవాగులో గురువారం స్నానాలు చేశారు. ముత్తయిదువులు ఆ దంపతులకు వాగులోని నీటితో ఆశీర్వదించారు. మళ్లీ ఏడాది వరకు సంతానం కలగాలని వరంపట్టారు.















